క్లుప్తంగా

కొత్తపల్లి-జీజీహెచ్ సర్వీస్ పునరుద్ధరణ

జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

కాకినాడ సిటీ: కలెక్టర్ ఆదేశాలతో యు.కొత్తపల్లి-కాకినాడ జీజీహెచ్ మధ్య ఆర్టీసీ బస్ సర్వీసును అధికారులు పునరుద్ధరించారు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో యు.కొత్తపల్లి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వరకూ నేమాం, వాకలపూడి మీదుగా బీచ్ రోడ్డులో నడిపిన ఆర్టీసీ బస్సు సర్వీసు విద్యార్థులకు, మహిళలకు, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేదని, ఐదేళ్ల నుంచి ఈ సర్వీసును నిలిపివేయడం వల్ల ఇబ్బంది పడుతున్నామని, బస్సును పునరుద్ధరించాలని యు.కొత్తపల్లి ప్రజలు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కోరారన్నారు. దీంతో కలెక్టర్ షణ్మోహన్ బస్సును పునరుద్ధరించాలని ఆదేశించారన్నారు. ప్రజలకు అనువైన సమయంలో రెండు ట్రిప్పులు నడుపుతున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 6.30 గంటలకు కాకినాడలో బయలుదేరి 7.30 గంటలకు కొత్తపల్లి వెళ్లి అక్కడ నుంచి ఉదయం 7.50 గంటలకు బయలుదేరి ఉప్పాడ, సుబ్బంపేట, నేమాం, సూర్యారావుపేట లైట్‌హౌస్, వాకలపూడి, వలసపాకల, సర్పవరం జంక్షన్ మీదుగా 9.05 గంటలకు జీజీహెచ్ చేరుకుంటుందని రవాణా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. తిరిగి సాయంత్రం 4.40 గంటలకు జీజీహెచ్ వద్ద బయలుదేరి 5.55 యు.కొత్తపల్లి వెళ్తుందన్నారు. తిరిగి కొత్తపల్లిలో 6.10 గంటలకు బయలుదేరి రాత్రి 7.10 గంటలకు కాకినాడ వస్తుందని తెలిపారు.

గ్యాస్ కంపెనీలు నిబంధనలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్దనరావు

బోట్‌క్లబ్: గ్యాస్ కంపెనీ డీలర్లు తూనికలు, కొలతల శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆశాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్దనరావు అన్నారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా గురువారం కాకినాడలోని గ్యాస్ కంపెనీ డీలర్లు, సిబ్బంది, డెలివరీ బాయ్స్, వినియోగదారులకు అవగాహన కల్పించారు. డెలివరీ బాయ్స్ స్ప్రింగ్ బ్యాలెన్స్ తూనిక యంత్రాన్ని తీసుకువెళ్లి ప్రతి వినియోగదారునికి గ్యాస్ సిలిండర్ తూకం వేసి చూపించాలన్నారు. నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ ధరకు సిలెండర్ డెలివరీ చేయకూడదన్నారు. డీలర్లు కూడా గ్యాస్ గొడౌన్‌లో సిలిండర్లు సంబంధిత డీలర్ వేయింగ్ మిషన్ ఏర్పాటు చేసి సిలిండర్ తూకం ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కమర్షియల్ సిలిండర్ మీద లీగల్ మెట్రాలజీ ప్యాకేజీ నిబంధనలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సలీం పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వలసపాకల క్రికెట్ కార్నివాల్ సీజన్-4 పోటీలను మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ప్రారంభించారు. వలసపాకల గ్రామానికి చెందిన 5 జట్లు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కాలేటి సునీల్‌కుమార్, మేడిశెట్టి సత్యనారాయణ, జాన్, ముదుగు జశ్వంత్, ఉండ్రాజపు కౌశిక్ తెలిపారు. 31 తేదీన ఫైనల్ పోటీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మూగజీవాలకు గ్రాసం వితరణ

బోట్‌క్లబ్: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ స్థానిక జంతుహింస నివారణ సంఘంలో ఉన్న మూగ జీవాలకు గురువారం పశుగ్రాసాన్ని అందజేశారు. గోవులకు ఎండు గడ్డి, పచ్చగడ్డి కొరత విషయాన్ని స్నేహితుల ద్వారా తెలుసుకున్న హరీష్ వ్యాన్లలో సరకును అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సత్తిబాబు, వెంకటేష్, చార్లీ, శేఖర్ పాల్గొన్నారు.

పేదలకు కళ్లజోళ్లు పంపిణీ



కళ్లజోళ్లు అందజేస్తున్న రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ పూర్వవిద్యార్థులు

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ కాకినాడ హాల్లో గురువారం బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐగ్లాస్ ప్రాజెక్టు ద్వారా 85 మంది పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేసారు. రెడ్‌కాన్వెంట్ చారిటబుల్ ట్రస్ట్ పూర్వ విద్యార్థి కల్యాణి ప్రసాద్ అందజేసి మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా ప్రాజెక్టు ద్వారా కొన్ని వేల మందికి లబ్ధిదారులకు సేవలు అందచేయడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ, జీఎల్ జగన్నాథరావు, డి.రామసుబ్రమణ్యం, పులవర్తి కుమార్, శ్రీనివాస్, జరీనా పాల్గొన్నారు.



కరపలో మధ్యాహ్నం వేసవితాపానికి నిర్మానుష్యంగా కనిపిస్తున్న మెయిన్‌రోడ్డు



కరపలో దట్టంగా కమ్ముకున్న మబ్బులు



కరపలో కురుస్తున్న వర్షం

మండించి.. మబ్బేసి.. ముంచెత్తి..

- ఉదయం ఉష్ణోగ్రతలకు భీతిల్లిన ప్రజలు
- మధ్యాహ్నపు మబ్బులకు ఊరడిల్లి..
- సాయంత్రపు వర్షానికి ఉపశమించారు..

కరప: అసలే పెద్దకార్తె ఎండలు. ఆపై భానుడు ప్రతాపం చూపడంతో గురువారం ఉష్ణతాపానికి ప్రజలు విలవిల్లాడారు. ఈ ఏడాది ఎప్పుడూ లేనంతగా ఏప్రిల్ నెలలో వేసవితాపం ఎక్కువగా ఉండగా, చిన్న, పెద్దకార్తెలు ప్రతాపం చూపిస్తుండటంతో వడగాడ్పులు భరించలేక వృద్ధులు, మహిళలు అపసోపాలు పడ్డారు. మధ్యలో అల్పపీడన ప్రభావంతో అప్పుడప్పుడు వర్షాలు పడినా నాలుగు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి తాపం గురించి భయాందోళనలు వ్యక్తం చేస్తుండగానే మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకోవడంతో పగలే చీకటిగా మారింది. వాహనచోదకులు లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. చల్లటి గాలులు వీచడంతో చిన్నారులు బయటకు వచ్చి కేరింతలు కొడుతూ సందడి చేశారు. కొద్ది సేపటికి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది, కొన్ని గ్రామాల్లో చిరుజల్లులు పడటంతో ప్రజలు ఎండవేడి నుంచి ఉపశమనం పొందారు. రబీ ఈ ఏడాది ఆలస్యమైన మెరక, కాలువశివారు ప్రాంతాల్లో కోతలు ముమ్మరంగా చేపట్టారు. వరికోత యంత్రాలతో కోసిన పంట కళ్లాల్లోను, లే అవుట్లలోను ధాన్యం రాశులు చేసి ఉంచేశామని, గాలులకు రాశులపై కప్పిన బరకాలు ఎగిరిపోయి, తడిసిపోయాయని రైతులు తెలిపారు. ఈ ఏడాది మామిడి పంట బాగుందనుకుంటే గాలివానకు మామిడికాయలు రాలిపోయి, నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు వర్షం పడినా మరో 10 రోజుల్లో రోహిణి కార్తె కలుస్తుందని, నైరుతి పవనాలు ముందుగా వస్తే ఎండలు తగ్గుముఖం పడతాయని, లేకపోతే రోహిణిలో కాచే ఎండలు ఎలాభరించాలో అని ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు.



కాకినాడ ఆర్టీఓ కార్యాలయం సెంటరులో కుండపోతగా కురుస్తున్న వర్షం



కాకినాడ స్టేడియం రోడ్డులో ఇలా..

కాకినాడలో కుండపోత

కాకినాడ రూరల్: వేసవి వేళ ప్రజలకు ఉపశమనం కలిగేలా అకాల వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతగా ఉండగా, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారింది. కుండపోతగా వర్షం పడింది. దీంతో పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి.

చిరస్మరణీయుడు ఆర్థర్ కాటన్



సిరిపురంలో కాటన్‌దొరకు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కరప: గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి, ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ నాయకుడు నున్న వీరవెంకట సత్యనారాయణ (వీరబాబు) పేర్కొన్నారు. మండలం సిరిపురం గ్రామంలో గురువారం కాటన్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉభయగోదావరి జిల్లాల్లో రెండు పంటలు పండుతున్నాయంటే కాటన్‌దొర చలవేనన్నారు. పెనుగుదురు, జి.భావారం, పెద్దాపురప్పాడు గ్రామాల్లోని కాటన్‌దొర విగ్రహాలకు వివిధ పార్టీల నాయకులు, రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్నదాతకు ఆరాధ్యుడు కాటన్

కాకినాడ రూరల్: బ్రిటిష్ పాలకుడైన కాటన్ దొర అన్నదాతకు ఆరాధ్యుడిగా నిలిచిపోయారని ఆయనను స్మరించుకోవడం గోదావరి జిల్లాల ప్రజల బాధ్యత అని విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద గురువారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

బాలాజీచెరువు: సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణన్ అధ్యక్షులు యాళ్ల రత్నారావు పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాపనదొరకాలనీలో కాటన్ జయంతిని నిర్వహించారు. క్లబ్ సీనియర్ సభ్యుడు డీఎల్ శాస్త్రి కాటన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ జిల్లా పచ్చని పొలాలతో సస్యశ్యామలంగా వర్ధిల్లడానికి గల కారణం ధవళేశ్వరం వద్ద ఆయన నిర్మించిన బ్యారేజ్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో ఈ ప్రాజెక్టు నిర్మించి దేశ వ్యాప్తంగా పేరొందారన్నారు. భావి ఇంజినీర్లు కాటన్‌ను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి మేలుచేసే పరిశోధనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాటన్ గొప్ప మానవతావాదని, ఆయన దార్శనికతను, సేవా తత్పరతను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు దిలీప్‌కుమార్ సదనాని, గోవింద్, రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సీజీఆర్ఎఫ్

- చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణ
- విద్యుత్ సమస్యలపై వినతుల స్వీకరణ



సమావేశంలో ఫోరమ్ సభ్యులతో కలసి ఫిర్యాదులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణ

కరప: వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమ్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే సీజీఆర్ఎఫ్ (కన్సూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ ఫోరమ్) సమావేశం నిర్వహించినట్టు ఆ సంస్థ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల సమస్యలు శాఖాపరంగా పరిష్కారం కాకపోతే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్‌చేసి చెప్పవచ్చన్నారు. విశాఖపట్నంలోని తమ ఫోరమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో విద్యుత్‌శాఖ తప్పులు చేస్తే వారికి ఫైన్ వేయడం, వినియోగదారుడుకి నష్టం కలిగితే తగిన పరిహారం ఇప్పించడం జరుగుతుందన్నారు. ఏడాదిలో 8,753 ఫిర్యాదులు రాగా 8,596 పరిష్కరించగా 157 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవి కూడా మార్చి, ఏప్రిల్‌కు సంబంధించినవేనన్నారు. 108 కేసులకు సంబంధించి రూ.14.37 లక్షలు వినియోగదారులకు నష్టపరిహారంగా అందజేసినట్టు ఆయన తెలిపారు. కరప సబ్‌డివిజన్ పరిధిలో వివిధ సమస్యలపై 11 ఫిర్యాదులు వచ్చాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు, రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజీఆర్ఎఫ్ రెవెన్యూ సభ్యుడు సలాది సుబ్బారావు, స్వతంత్ర సభ్యుడు ఎన్.మురళీకృష్ణ, విద్యుత్‌శాఖ డీఈ తుమ్మలపల్లి విష్ణుమూర్తి, ఏఈ సానా ఈశ్వరప్రసాద్, సబ్ ఇంజినీర్ ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల నిర్వహణ భేష్

- దేవదాయశాఖ డీసీ రమేష్‌బాబు
- భావనారాయణస్వామి ఆలయ ఈఓ మాచిరాజుకు సత్కారం



భావనారాయణస్వామి దేవస్థానం ఈఓను సత్కరిస్తున్న దేవాదాయశాఖ డీసీ రమేష్‌బాబు

బోట్‌క్లబ్: సర్పవరం దేవస్థానం ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణను గురువారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు సత్కరించారు. ఈ నెల ఆరో తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను విజయవంతగా నిర్వహించడం, చరిత్రలో మొదటిసారిగా తెప్పోత్సవాన్ని ఎటువంటి ఇబ్బందీ లేకుండా నిర్వహించడంతో ఆయనను ఈ మేరకు సత్కరించారు. స్వామివారి వార్షిక కల్యాణాలకు ఏదో వివాదం జరిగేదని, ఈసారి అలాంటివి లేకుండా వందలాది భక్తుల సమక్షంలో గ్రామస్తులు, దాతలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం తీసుకుని విజయవంతం చేశారని రమేష్ బాబు ఆయనను ప్రశంసించి జ్ఞాపిక అందజేశారు. పూర్తిగా గ్రామస్తులు, భక్తులు, సహకరించారని అన్ని వర్గాల సహాయ సహకారాలు ఉన్నాయని అందుకే ఈ కార్యక్రమాలు తన వంతు బాధ్యతగా సక్రమంగా నిర్వహించానని లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా దేవాదాయశాఖాధికారి సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఫణికుమార్, సోమరాజు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలను

సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

కరప: చిన్న పరిశ్రమలతో పాటు, పెద్ద వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మత్స్యకార వ్యాపారులు, ఇతర స్వయంశక్తి గ్రూపుల సభ్యులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల శాఖ ఏడీ విజయకుమార్ మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న వివిధ సబ్సిడీ పథకాలను వివరించి, అవగాహన కల్పించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే వారికి పథకాల గురించి వివరించి, వ్యాపారాలు చేసేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. మత్స్యశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను కూడా వివరించారు. ఈ సందర్భంగా మత్స్యకార మహిళా వ్యాపారులు అడిగిన సమస్యలపై అధికారులు వివరణ ఇచ్చారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, డీఆర్‌డీఏ ఏపీడీ ఎంఎం జిలానీ, డీపీఎం వెంకటేశ్వరరావు, బాబూరావు, మత్స్యశాఖ ప్రతినిధి నవ్యశ్రీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ అరుణ, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి, సీసీలు పుష్పలత, ప్రసాద్, రామమణి పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థతో స్థిరమైన అభివృద్ధి

కాకినాడ రూరల్: ఉమ్మడి కుటుంబాలతో స్థిరమైన అభివృద్ధి సాధ్యమని విశ్రాంత ఉపాధ్యాయిని సత్యవాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఏటా మే 15న అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం జరుపుకొంటామని, మనల్ని ప్రేమించే వ్యక్తులు కుటుంబాల ద్వారా మాత్రమే లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు సిద్ధం చేసుకుందామా..

- విద్యార్థులూ సమాయత్తం కండి
- ముందస్తు సేకరణతో సమయం సద్వినియోగం
- సమీప సచివాలయాల్లో దరఖాస్తులకు అవకాశం



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): టెన్త్, ఇంటర్మీడియెట్ తదితర పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. పై తరగతుల్లో ప్రవేశాలకు, వివిధ కోర్సుల్లో చేరేందుకు పలు ధ్రుపత్రాలు తప్పనిసరి. అందువల్ల విద్యార్థులు ముందస్తుగా వారికి కావలసిన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవడం ఎంతో అవసరమని ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచిస్తున్నారు.

సచివాలయాల ద్వారా..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో అన్ని రకాల ధ్రువపత్రాలు సులువుగా పొందే అవకాశం లభించింది. సచివాలయాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉన్నాయి. అందువల్ల విద్యార్థులు తమ సమీప సచివాలయానికి వెళ్లి కావలసిన ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా అధికారులు ధ్రువపత్రాలు మంజూరు చేస్తారు. ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ప్రధానంగా కుల, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పై కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే వారు ముందుగానే ఈ ధ్రువపత్రాలు సమర్పించి ఉంటారు. అయితే నేరుగా అడ్మిషన్ పొందే ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో చేరేవారు ఈ నెలలోనే అవసరమయ్యే ధ్రువ పత్రాలను పొందివుంటే ఆందోళన చెందకుండా పై కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు వీలవుతుంది.

ధ్రువపత్రాలు పొందాలంటే

- ఒకటో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశానికి.
- పలువురు విద్యార్థులకు ప్రధానంగా కుల, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ
- ఆదాయం వంటి ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటి కోసం సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- పై వాటిని పొందాలంటే ఆధార్, రేషన్ కార్డు, విద్యార్థతకు సంబంధించిన అర్జీ పూర్తిచేసి అవసరమైన నకలును సచివాలయం డిజిటల్ సహాయకుడికి అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో పొందుపరచిన వివరాలపై వీఆర్‌ఓ క్షేత్రస్థాయిలో విచారించి, అందుకు సంబంధించిన వివరాలపై నివేదికను ఆర్ఐకి సమర్పిస్తారు.
- ఆర్ఐ పరిశీలించి అన్ని సరిగా ఉంటే తహసీల్దార్ వద్దకు పంపిస్తారు. అప్పుడు తహసీల్దారు తన లాగిన్‌లో పరిశీలించి డిజిటల్ సంతకంతో ధ్రువపత్రాన్ని మంజూరు చేస్తారు. దరఖాస్తుదారుడి మొబైల్‌కు వచ్చే మెసెజ్‌తో సచివాలయంలో కానీ, మీ సేవా కేంద్రంలో కానీ ధ్రువపత్రాలను పొందవచ్చు.

ఒత్తిడి పెరగక ముందే

సాధారణంగా మే, జూన్ నెలల్లో ముఖ్యంగా సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ధ్రువపత్రాల జారీకి సంబంధించి సిబ్బందికి అధిక ఒత్తిడి ఉంటుంది. వీటి కోసం దరఖాస్తు చేసుకున్న తరువాత వీఆర్‌ఓ, ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలన, విచారణ చేయాల్సి ఉంటుంది. అందువల్ల దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వస్తే ధ్రువపత్రాల జారీ కూడా అలస్యమవుతుంది.

సెలవుల్లోనే పొందండి

విద్యా సంవత్సరం ఆరంభం కాకముందే విద్యార్థులు తమకు అవసమైన ధ్రువపత్రాలను రెవెన్యూ అధికారుల నుంచి పొందాలి. సకాలంలో ధ్రువ పత్రాలకోసం దరఖాస్తు చేసుకోకపోతే గడువు తేదీ నాటికి ఒత్తిడి పెరుగుతుంది. ఈ సెలవుల్లో విద్యార్థులు తమకు కావలసిన ధ్రువపత్రాలు పొందడానికి సద్వినియోగం చేసుకోవాలి.

– చేవూరి రవి, ఎంఈఓ, కాకినాడ అర్బన్

వెయిట్‌లిఫ్టర్‌కు కలెక్టర్ అభినందన



వెయిట్‌లిఫ్టర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఈ నెల 3, 4 తేదీల్లో కేరళలోని ఎర్నాకులంలో జరిగిన జాతీయ స్థాయి పాన్ ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అండ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఏపీఎస్ ఆర్టీసీ డిపోకి చెందిన మండపల్లి శ్రీనివాసరావు నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు గురువారం కలెక్టర్ షణ్మోహన్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావును కలెక్టర్ అభినందించారు. అలాగే వచ్చే జూన్‌లో బెంగుళూరులో 40 దేశాలతో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఆసియా మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీనివాసరావు ఎంపిక కావడంతో ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కాకినాడ జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: జీవ వైవిధ్య రక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని రాష్ట్ర జీవవైవిధ్య మండలి ప్రాంతీయ సమన్వయకర్త వి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. గాంధీనగర్ గ్రంథాలయంలో గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య ప్రసాద్ మాట్లాడుతూ జీవ వైవిధ్యం భూమికి శ్వాస వంటిందని, ప్రతిజీవికి భూమిపై జీవించే హక్కు ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమన్నారు.

ఆటవీశాఖ రేంజర్ ఆర్ఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆవరణ వ్యవస్థలో సమతుల్యం ఉన్నప్పుడే జీవుల మనుగడ సాధ్యమని, ఏదైనా ఒక జాతి (ప్రాణి) నశించిపోయిందంటే ఆ జాతి మీద ఆధారపడే ఇతర ప్రాణులు నశించిపోయే ప్రమాదం ఉందన్నారు. గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే ప్లాస్టిక్ నిషేధించాలన్నారు. ఈ పోటీలలో వివిధ పాఠశాలలు, కళాశాలల నుండి 218 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీహర్ష, బాలల సైన్స్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు రవికుమార్, యంగ్ మైండ్ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ, బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- నిందితుడికి ఏడాది జైలు
- రూ.వెయ్యి జరిమానా

కరప: ఉద్యోగం ఇప్పిస్తానని మోసంచేసిన నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ పీఅండ్‌ఈ కోర్టు మెజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి తీర్పు చెప్పారు.

దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలం పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన బిరుదా వెంకటరమణ కుమారుడికి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని, నెలకి రూ.50 వేలు జీతం వస్తుందని నమ్మించి వెంకటరమణ వద్ద నుంచి విశాఖపట్టణానికి చెందిన పూరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.10 లక్షలు తీసుకుని మోసం చేశాడు. వెంకటరమణ తాను ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వాలని శ్రీనివాసరెడ్డిని అడగగా డబ్బు తిరిగి ఇవ్వకపోగా, చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2015 డిసెంబరు పదో తేదీన అప్పటి ఎస్ఐ కేసు నమోదుచేసి, కాకినాడ కోర్టులో శ్రీనివాసరెడ్డిపై చార్జిషీట్ ఫైల్ చేశారు. ఫిర్యాది వెంకటరమణ తరఫున కాకినాడ స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ పీఅండ్ ఈ కోర్టు ఏపీపీ ఎన్.నాగరాధిక కేసు వాదించారు. పూర్వాపరాల పరిశీలన అనంతరం మెజిస్ట్రేట్ పై విధంగా తీర్పు చెప్పారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో కరప ఎస్ఐ టి.సునీత, కోర్టు కానిస్టేబుల్ కె.రాజేష్ ఈ కేసుకు సంబంధించిన సాక్షులను, సాక్ష్యాలను ప్రవేశపెట్టి, ముద్దాయికి శిక్ష పడడంలో కృష చేశారు.

కేంద్రీయ విద్యాలయ ప్రతిభ



దేవ హాసన్



స్నేహ శరణ్య



కె.భాను

కాకినాడ రూరల్: ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలలో కాకినాడ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ బి.శేఖర్ తెలియజేశారు. మొత్తం 33 మంది పరీక్షకు హాజరు కాగా 33 మంది ఉత్తీర్ణులయ్యారని, వీరిలో అత్యధికంగా దేవ హాసన్ 464 మార్కులు, స్నేహ శరణ్య 463 మార్కులు, కె.భాను 449 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ గురువారం మీడియాకు తెలియజేశారు.